క్లుప్తంగా

ఘనంగా అమృత కలశ యాత్ర

రేపల్లె: నా మట్టి–నా దేశం కార్యక్రమంలో భాగంగా నెహ్రూ యువ కేంద్రం గుంటూరు, అహ్మదీయ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని విజ్ఞాన్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం అమృత కలశ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల త్యాగాలను నినదించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సాజిద్ బాషా, నెహ్రూ యువ కేంద్ర డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ కిరణ్మయి దేవిరెడ్డి, అహమ్మదీయ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ సయ్యద్ తాహేర్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

4న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

భట్టిప్రోలు: కోల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల సహకారంతో ఈ నెల 4న ఆర్‌సీఎం చర్చి రోడ్డులోని జ్యోతి హెల్త్ సెంటర్‌లో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు సొసైటీ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి వైద్య పరీక్షలు చేసి, అర్హులైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎల్వీ ప్రసాద్ వైద్యశాలకు చెందిన నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన

రేపల్లె రూరల్: విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్డీఆర్ఎఫ్ బృందం పట్టణంలోని మున్సిపల్ హైస్కూలు ఆవరణంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించింది. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను బృందం సభ్యులు ప్రయోగపూర్వకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కనగాల శ్రీదేవి, కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు, ఎన్డీఆర్ఎఫ్ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులు అందజేత

బాపట్ల అర్బన్: ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని నందిరాజుతోట నివాసి కొమర వెంకట రత్నకుమార్ ఇటీవల మృతి చెందాడు. మృతుని కుటుంబానికి మంగళవారం వైఎస్సార్ బీమా కింది మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10వేలను పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు నందిరాజు, గ్రామ పెద్దలు పీటా వేణుగోపాల్, భాస్కరరావు, రవీంద్ర ప్రసాద్ సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రవీణ రాణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వాణి సుమన్విత, వలంటీర్ సుప్రియ పాల్గొన్నారు.

శ్మశాన స్థలాల కోసం వినతి

రేపల్లె రూరల్: డివిజన్ పరిధిలోని ఎస్సీ గ్రామాలలో ప్రధాన సమస్యగా ఉన్న శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని కోరుతూ జై భీమ్ భారత్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు దోవా రమేష్ రాంజీ ఆర్డీవో హేలా షారోన్‌కు మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోతార్లంక శివ వెంకటేశ్వరవు, నెరుసు వెంకట్రావు నాయుడు, రేపల్లె మండల కన్వీనర్ కర్రా బాబురావు, యనమల సుబ్బారావు, మండే యాకోబు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై నేడు అవగాహన

భట్టిప్రోలు: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కృష్ణా నది పరీవాహక తీర ప్రాంత ప్రజలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది బుధవారం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

అయ్యప్పలకు నిరంతర చద్ది ఏర్పాటు



వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామ దేవత కట్లమ్మ తల్లి దేవాలయంలో అయ్యప్ప మాలధారులు అయ్యప్ప స్వామి ప్రధాన పీఠాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప, శివ, భవాని దీక్ష ధారులకు ప్రతి నిత్యం సద్ది ఏర్పాటు చేశారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి దీక్షధారులు, గ్రామస్తులు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం డిసెంబర్ 12వ తేదీ వరకు కొనసాగుతుందని దేవస్థాన కమిటీ నిర్వాహకులు, ఆలయ అర్చకులు క్రోవి రామకృష్ణ తెలిపారు. ప్రస్తుతం 100 మందితో ఈ కార్యక్రమం ప్రారంభమైందని, దీక్షాదారులు పెరిగితే అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

రేపల్లె పట్టణాభివృద్ధికి ప్రత్యేక కృషి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



హాజరైన కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు

- పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ
- మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ

రేపల్లె: పట్టణాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సాధారణ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి, మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు కృషితో పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు హానికలిగించే పాలిథిన్, ప్లాస్టిక్ నిషేధించటం జరిగిందని, వీటి నివారణకి ప్రతి ఒక్కరూ సహకరించాలని చైర్‌పర్సన్ కోరారు. వీటి స్థానంలో గన్నీ బ్యాగ్‌లను, ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలన్నారు. గృహాల నుంచి వచ్చే చెత్తను తడి చెత్త–పొడి చెత్తగా వేరు చేసి అందించాలని పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని కోరారు. మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పట్టణంలో అపరిశుభ్రంగా ఉంటున్న ప్రాంతాలను గుర్తించి సిబ్బందితో పరిశుభ్రపరచాలని అధికారులకు సూచించారు. నిరంతరం ఆయా వార్డులలో పారిశుద్ధ్య నిర్వహణపై పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. అనంతరం ఏజెండాలోని 17 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త, మున్సిపల్ కమిషనర్ విజయసారథి, కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

- దేశంలో తొలి కార్మిక సంఘంగా గుర్తింపు
- పోరాటాలతో కార్మిక చట్టాలు, హక్కుల సాధన
- రాష్ట్ర నాయకుడు పి.నాగాంజనేయులు



అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రేపల్లె: తమ హక్కులను, చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వంపై కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు పి. నాగాంజనేయులు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ 14వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయం వద్ద, వేర్హౌస్ గోదాం, యూనియన్ కార్యాలయం వద్ద జెండాలను ఎగురవేసి కార్మికులు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగాంజనేయులు మాట్లాడుతూ భారతదేశంలో ఏర్పడిన తొలి కార్మిక సంఘం ఏఐటీయూసీ దేశంలో కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి నిరంతరం ఉద్యమిస్తూ అనేక చట్టాలను, హక్కులను సాధించిందన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేస్తూ కార్మికులను కార్పొరేట్లకు బానిసలుగా చేస్తూ లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికులు తమ హక్కుల సాధన కోసం, దేశ సంపదను కాపాడుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా గౌరవాధ్యక్షుడు గొట్టుముక్కల బాలాజీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బెజ్జం ముఖర్జి, నాయకులు చొక్కాకుల శివశంకర్, సిరంశెట్టి శ్రీనివాసరావు, కుసుమ సత్యవతి, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు బాబు, వసంతరావు, తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు గొట్టుముక్కల శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: కార్మికుల హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటాలను చేస్తున్నది ఏఐటీయూసీ అని రాష్ట్ర నాయకులు పి.నాంగాంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం వేమూరు నియోజకవర్గ అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు అన్నారు. యూనియన్ 104వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. గౌరవాధ్యక్షుడు జి.బాలాజి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఓబులశెట్టి రమేష్, వి.శ్రీనివాసరావు, నాగరాజు, పి.శ్రీకాంత్, షేక్ బాబ్జి, అంకమరావు, గోపీ, సాయి, అమర్ పాల్గొన్నారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళులు



ఇందిరా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



పటేల్, ఇందిరా గాంధీ చిత్రపటాలకు ఎంపీపీ, సిబ్బంది నివాళి

బాపట్ల అర్బన్: భారతదేశ తొలి మహిళ ప్రధానిగా ప్రజా రంజకమైన పాలనను ఇందిరా గాంధీ అందించారని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు పఠాన్ రాజేష్ అన్నారు. పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు గంట అంజిబాబు ఆదేశాల మేరకు పఠాన్ రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరా గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని సూర్యలంక రహదారిలో ఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. పఠాన్ రాజేష్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం ఎంతో పాటుపడిన నిస్వార్థ నాయకురాలు ఇందిరా గాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్వీఆర్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దోనీపూడి దేవరాజు, నక్కల రాంబాబు, బక్కా రోశయ్య, దండు రేణుక పాల్గొన్నారు.

పటేల్, ఇందిరా గాంధీకి ఘన నివాళులు

భట్టిప్రోలు: దేశ ప్రజలందరూ ఐక్యతతో ఉండాలని నమ్మిన మహోన్నత వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి అన్నారు. పటేల్ జయంతి సందర్భంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జాతీయ సమైఖ్యత దినోత్సవం నిర్వహించారు. అలాగే భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖర్‌రావు, పంచాయతీ రాజ్, హౌసింగ్ ఏఈలు శేతు రామచంద్రరరావు, రావూరి సౌమ్య, ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, సూపరింటెండెంట్ సీహెచ్ జలజ, ఇన్‌చార్జి ఆర్ఐ శివరామకృష్ణ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుమ్మడి సాంబశివరావు, నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు సూరేపల్లి విద్యార్థిని



విద్యార్థిని బొర్రా గీతికాశ్రీ

సూరేపల్లి(భట్టిప్రోలు): సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్‌కు చెందిన బొర్రా గీతికాశ్రీ సోమవారం గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి డిస్కస్ త్రోలో ప్రతిభ చూపింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాస శర్మ మంగళవారం తెలిపారు. ఎంపికైన గీతికాశ్రీని, శిక్షణ ఇచ్చిన పీఈటీ జీవీఎస్ నాగేశ్వరరావును హైస్కూల్ పాలకవర్గ అధ్యక్షుడు వేపూరి చలమయ్య, కార్యదర్శి రావు వెంకట కృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మోదీ విజన్‌తో దేశం అభివృద్ధి



రేపల్లె రూరల్: ఢిల్లీలో జరిగిన మేరా దేశ్–మేరా మట్టి కార్యక్రమానికి రేపల్లె నియోజకవర్గం నుంచి పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.జగన్నాథ శాస్త్రి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజన్‌తో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. పార్టీ పిలుపు మేరకు రేపల్లె నుంచి ఢిల్లీకి తరలివెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ కార్యదర్శి అన్నం సాయి, నాయకులు సుఖన గణేష్, బండారు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని అవలంబించాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న పట్టణ సీఐ నజీర్‌బేగ్

రేపల్లెరూరల్: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పట్టణ సీఐ నజీర్‌బేగ్ అన్నారు. కెరీర్ గైడెన్స్, ఈవ్‌టీజింగ్ నివారణ తదితర అంశాలపై పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో మండలంలోని పేటేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం 9, 10వ తరగతుల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈవ్‌టీజింగ్ చేయటం, దురలవాట్లు చేకోవడంతో బంగారు భవిష్యత్ అంధకారమవుతుందని హెచ్చరించారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు అర్థం చేసుకుని, అంశాలను అడిగి తెలుసుకోవాలని, గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నవీన్‌కుమార్, పట్టణ ఆదర్శ వేదిక కార్యదర్శి యడ్లపల్లి కిషోర్‌బాబు, హెచ్ఎం సీహెచ్ బాబ్జి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందుకున్న వలంటీర్లు

భట్టిప్రోలు: మండలంలో ఖాళీగా ఉన్న నాలుగు వలంటీర్ పోస్టులను అధికారులు భర్తీ చేశారు. అభ్యర్థులకు నియామక పత్రాలను మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధుల అందజేశారు. ఐలవరం–1 పరిధిలో శివన్నారాయణ, రాచూరు పరిధిలో వెంకటేశ్వరరావు, భట్టిప్రోలు–2 పరిధిలో అనిత, భట్టిప్రోలు–1 పరిధిలో అన్నపూర్ణ వలీంటర్లుగా పనిచేయనున్నారు. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, నాయకులు పాల్గొన్నారు.

దూరవిద్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



వాల్‌పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న ఓపెన్ స్కూల్ ప్రతినిధులు

రేపల్లె: రేపల్లె ప్రాంతంలో 10వ తరగతిలో దూరవిద్య ద్వారా ఎక్కువ మంది విద్యను అభ్యసించేలా కో–ఆర్డినేటర్‌లు పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ బాపట్ల జిల్లా కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఓపెన్ స్కూలులో 10వ తరగతి అభ్యసించే విద్యార్థులకు ఏబీఆర్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణనిస్తున్నట్లు తెలియజేశారు. తీరప్రాంత వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఓపెన్ స్కూల్ వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్ సీహెచ్ రవికుమార్, ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్‌లు రాజేంద్రప్రసాద్, పాములు, ఆదిశేషరావు, అంకమ్మరావు పాల్గొన్నారు.

‘మిస్టర్ ఆంధ్ర’లో రేపల్లె బాడీబిల్డర్ ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఇజ్జాడ కుమార్

రేపల్లె రూరల్: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శ్రీకృష్ణదేవరాయ కళావేదికపై ఈ నెల 29న ఆదివారం నిర్వహించిన మిస్టర్ ఇండియా కమ్ బాడీ బిల్డింగ్ కాంపిటేషన్‌లో భాగంగా నిర్వహించిన మిస్టర్ ఆంధ్రా పోటీల్లో రేపల్లె ఓల్డ్ టౌన్‌కి చెందిన యువకుడు ప్రతిభ కనపరిచాడు. పట్టణంలోని బీఆర్ఎస్ పవర్ జిమ్‌లో శిక్షణ పొందుతూ పోటీలలో పాల్గొన్న ఇజ్జాడ కుమార్ 55–60 కేజీల విభాగంలో మిస్టర్ ఆంధ్ర పోటీల్లో మూడవ స్థానం సాధించారు. దీంతో పట్టణానికి చెందిన పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుమార్‌కు జిమ్ నిర్వాహకుడు రాజేష్ అభినందనలు తెలపుతూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.

ఉత్సాహంగా స్పీడ్ సైకిల్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న మోపిదేవి హరనాథబాబు

చెరుకుపల్లి: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నాయకుడు మోపిదేవి హరనాథబాబు అన్నారు. రాంబొట్లపాలెంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చీరాల ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పేరుబోయిన వెంకటేశ్వరరెడ్డి మెమోరియల్ స్పీడ్ సైకిల్ పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోపిదేవి హరనాథబాబు మండల వైసీపీ నాయకులతో కలసి పోటీలను ప్రారంభించారు. రాంబొట్లపాలెం సెంటరు నుంచి యాజలి హైస్కూల్ వరకు జరిగిన పోటీల్లో 30 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరిలో ఆరుగురికి గ్రామపెద్దలు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి స్థానం పాలపర్తి దిలీప్‌కి రూ.10వేలు నగదును గ్రామ ఉప సర్పంచ్ పేరుబోయిన బలరామిరెడ్డి, ద్వితీయ బహుమతి పిట్టు వెంకటేశ్వరరెడ్డికి రూ.7వేల అలుమొలు శివారెడ్డి, మూడో స్థానం కోనేటి ఫణీంద్రకు రూ.5వేలు పులుగు గోవర్ధన రెడ్డి, నాల్గవ స్థానం ముచ్చు గణేష్ రెడ్డికి రూ.4 వేలు జూపూడి బేబేశ్వరరావు, ఐదో స్థానం షేక్ జహగీర్ బాషాకు రూ.3వేలు పిట్టు వెంటేశ్వరరెడ్డి, ఆరో స్థానం గుంతకల శవసాయిరామ్‌కు రూ.2 వేలు సంకా జయప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండలురెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను కొటేశ్వరరావు, నాయకులు తూము కోటేశ్వరరావు, పిట్టు కిరణ్ కుమార్‌రెడ్డి, దుండి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

చిన్నారుల కోసం రక్తదాన శిబిరం

తుమ్మలపాలెం(ప్రత్తిపాడు): స్థానిక మిట్టపల్లి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్, గుంటూరు సీజీఎస్టీ, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారి కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ మేడూరి భాస్కరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపికృష్ణ పర్యవేక్షణలో 107 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కళాశాల సెక్రటరీ ఎంబీవీ సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి కిషోర్ రక్తదానం చేసిన విద్యార్థినీ, విద్యార్థులను అభినందించారు. శిబిరంలో సీజీఎస్టీ సూపరింటెండెంట్లు డి.రామ్మోహన్ రెడ్డి, బీఎల్‌సీ శేఖర్ రెడ్డి, ఏఓ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి జయరావు మిరియాల పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దురాక్రమణను ఆపేయాలి

లక్ష్మీపురం: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణని తక్షణమే ఆపేయాలని పౌరుల హత్యలు దమన కాండకు ముగింపు పలకాలని విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య విజ్ఞప్తి చేశారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం విద్యావేత్తలు, విశ్లేషకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గాజాపై ఇజ్రాయిల్ దళాలు తీవ్రస్థాయిలో దాడులు జరుపుతున్నాయని, ఇప్పటికే పాలస్తీనాలో మృతుల సంఖ్య 8వేలకు పైగా చేరిందన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకుందాం

డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు



నివాళి అర్పిస్తున్న ఫుడ్ టెక్నాలజీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

బాపట్ల: ఉక్కు మనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ యువతకు స్ఫూర్తి దాయకమని వ్యవసాయ కళాశాల డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా వ్యవసాయ కళాశాల, వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల, ఫుడ్ టెక్నాలజీ కళాశాలల్లో వేడుకలు జరిగాయి. వ్యవసాయ కళాశాలలో డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు, ఫుడ్ టెక్నాలజీలో డాక్టరు రాధా, వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో డాక్టర్ డీడీ స్మిత్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయి పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేశ ఐకమత్య, సమగ్రత, భద్రతను కాపాడటానికి అంకితమవుతామని విద్యార్థులతో జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కె.శ్రీనివాసులు, డాక్టర్ సి.సంధ్యారాణి, డాక్టర్ ఎం.లత, కె.విజయ ప్రకాష్, హసీనా బేగం, కె.కృపావతి, జి.వీరప్రసాద్, జి.రవిబాబు, బి.జాన్ వెస్లీ, ఎం.మాధవ, డాక్టర్ కేవీఎస్ రామిరెడ్డి, డాక్టర్ ఎస్ విష్ణు వర్ధన్, ఆర్.గణేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వేమూరు నియోజకవర్గ ఓటర్లు 1,93,854 మంది

వేమూరు: ఎన్నికల కమిషన్ ఓటరు ముసాయిదా జాబితా విడదల చేసిందని వేమూరు నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి మోహనరావు అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. నియోజకవర్గంలో 1,93,854 ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. మొత్తం 233 పోలింగ్ బూత్‌లలో పురుషుల ఓటర్లు 94146 మంది, మహిళా ఓటర్లు 99,701 మంది ఉన్నారని వివరించారు. చుండూరు మండలంలో 37,328, అమర్తలూరు మండలంలో 36,915, వేమూరు మండలంలో 33,520, కొల్లూరు మండలంలో 44,219, భట్టిప్రోలు మండలంలో 41,872 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఓటరు జాబితాలను బూత్‌ల పరిధిలోని బీఎల్వోలకు అందుబాటులో ఉంచామని రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. ఓటరుగా నమోదు, సవరణ, తొలగింపునకు దరఖాస్తు చేసుకునేందుకు నవంబరు 4, 5, తేదీల్లో ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, దొప్పలపూడి జ్యోతిబాబు, దండే సుబ్బారావు, సుధాకర్, ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

పురుగుమందు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

పట్నంబజారు: అనుమతి లేకుండా పురుగుల మందు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు అయింది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఏటుకూరు రోడ్డులోని విష్ణుప్రియ కాంప్లెక్సులో కోటపాటి కోటేశ్వరరావు ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా పురుగు మందులతోపాటు, పలు ద్రావకాలు విక్రయిస్తున్నట్లు గుర్తించిన అగ్రికల్చర్ అధికారి పి.కిషోర్ తనిఖీ చేశారు. అనుమతులు లేని పలు పురుగుల మందులు స్వాధీనం చేసుకుని కిషోర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభకు మార్కులు ఒక్కటే కొలమానం కాదు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లోని ప్రతిభకు మార్కులు ఒక్కటే కొలమానం కాదని ప్రాంతీయ అగ్నిమాపక శాఖాధికారి ఎంఏక్యూ జిలానీ పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన లలితకళ, విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన అన్ని అంశాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. అనంతరం జిలానీ మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలకు చదువు ఒక్కటే సరిపోదని, వికాసంతో కూడిన సంపూర్ణ పరిజ్ఞానం ఉండాలని అన్నారు. సామాజిక సమస్యలను ఎదుర్కొనేందుకు ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం ఉండాలన్నారు. పాఠశాల కార్యదర్శి డాక్టర్ మంగాదేవి గారు, సహకార్యదర్శి జయశ్రీ, సీఏఓ రఘురాం, ప్రిన్సిపాల్ సుధామాధవి పాల్గొన్నారు.

నేడు సర్వ కార్యసిద్ధి గణపతి దేవాలయ ప్రతిష్ఠోత్సవం

చెరుకుపల్లి: సర్వ కార్యసిద్ధి గణపతి దేవాలయంలో ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కట్టా వెంటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కనగాల గ్రామంలో సీతామహాలక్ష్మి గిరిజన కాలనీలో టీటీడీ ఆర్థిక సహకారంతో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సర్వ కార్యసిద్ధి గణపతి దేవాలయంలో బుధవారం ఉదయం 10.51 గంటలకు ప్రతిష్ఠా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మంగళవారం వేద పండితులు అగ్నిహోత్రం షేషాచార్యులు ఆధ్వర్యంలో అంకురార్పణ, గణపతి పూజ అభిషేకాలు, హోమాలు, యాగాలు ప్రారంభించారు. ప్రతిష్ఠ మహోత్సవానికి శరణాగతి గోష్ఠి పీఠాధిపతులు నరేంద్ర రామాను దాస స్వామీజీ పాల్గొంటారని తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని అనుగ్రహం పొందాలని కమిటీ సభ్యులు కోరారు. పూజా కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, పొన్నపల్లి సత్యనారాయణ, చింతల మురళీకృష్ణ పాల్గొన్నారు.